కథ

# సందిగ్ధం

-మంత్రవాది మహేశ్వర్

సుగుణకు పాతికేళ్ళుంటాయి. మధ్యతరగతి కుటుంబంలోంచి వచ్చిన ఆడపిల్ల. తండ్రి ఏదో గవర్నమెంట్ స్కూల్లో టీచర్‌గా పని చేసి రిటైరయ్యారు. ఆ సంసార నావ కదలాలంటే సుగుణ సంపాదన చాలా అవసరం. తను కష్టపడి సంపాదించి తీసుకొస్తున్న జీతంరాళ్ళు తనకి కాకుండా తన కుటుంబానికి ఖర్చు చేయాల్సి వస్తోందన్న ఆలోచన ఎప్పుడూ రాలేదు సుగుణకి. అంతేనా, తన సంపాదనతో 'ఇల్లు' నెట్టుకురాగలుగుతున్నానన్న తృప్తి.

నెలరోజులు కష్టపడితే వచ్చేవి పదిహేనొందలు. అవి తండ్రి చేతిలో పెడితే అందులోంచి ఓ రెండొందలు తీసి యిచ్చేవాడాయన. బస్సుల్లో వెళ్ళడానికి, రావడానికి, దానికి దీనికి బొటాబొటిగా సరిపోయేవి సుగుణకు. 'ఇంకో వంద యివ్వండి' అని అడగాలనుకుని అడగలేకపోయింది చాలా సార్లు.

బజారునుంచి వస్తున్నప్పుడు ఏదైనా నచ్చిన చీర కనబడినా కొనడానికి సాహసించలేదు. తన కున్న ఆ నాలుగింటినే మార్చిమార్చి కట్టుకుంటూ సెలవురోజున ఉతుక్కుంటూ జాగ్రత్తగా కాలక్షేపం చేస్తూ వస్తోంది.

'నువ్వు బావుంటావు కనుక ఏదీ కట్టుకున్నా బావుంటావు. అదే మేమైతేనా?' అంటూండేవారు స్నేహితురాళ్ళు.

పండుగలు ఎన్నో వస్తున్నాయి... వెడుతున్నాయి. 'ఇదిగో ఈ కొత్తచీర నీకు' అని ఎవరూ సర్‌ప్రైజ్ చేయలేదు ఏనాడు.

తనూ పట్టించుకోలేదు.

ఆర్థిక పరిస్థితి అలాంటిది.

తండ్రికొచ్చే పెన్షనుకు తన జీతం తోడవ్వాలి.

ఇప్పుడు సుగుణకు ఒక కోరిక...చాలా చిన్నదే.

అది కూడా తనకొచ్చిన ఇంక్రిమెంట్ వల్లే కలిగి వుండాలి.

పాతబడిపోయి శిధిలావస్థకు చేరుకుంటున్న హ్యాండ్‌బ్యాగ్ ప్రక్కన పడేసి కొత్తది కొందామని.... ఆ నెల శ్రమఫలం అందుకుంది.

అమ్మ చెప్పిన ముఖ్యమైన సరుకులతో బాటు శీనుకి ఒక బొమ్మతుపాకీ, సుజీకి కొత్త పెన్ను పట్టుకొచ్చింది.

ఆ పసిముఖాల్లోని ఆనందానికి పరవశించి పోయింది.

తల్లికి తన జీతం అందించింది.. ఎప్పటిలాగే రెండొందలిచ్చింది తల్లి.

ఓ యాభై ..... అదీ హ్యాండ్ బ్యాగ్ కోసం.

అడగాలా.... వద్దా

సందిగ్ధం....

ఆలోచించింది...కానీ అడగలేకపోయింది.

రాత్రి భోజనాలయ్యాక-

ముఖం కడుక్కుంది. తలదువ్వుకుంది...అద్దంలో తనని తాను చూసుకుంది.

ముఖంలోని ఆ కళ పసిమిఛాయ- తను ఓ గొప్ప కుటుంబంలోంచి వచ్చిన అమ్మాయి అన్నట్లుగానే వుంటుంది. సహజంగా వుండే కళ....

అందమైన మెడ భాగం...

బోసిగా వుంది... ఆ మధ్య ఎప్పుడో తన పుట్టిన రోజుకి బాబయ్య యిచ్చిన రోల్డ్‌గోల్డ్ గొలుసుండేది....అది వెలవెలబోతే తీసేసింది.

'ఏమైనా చేయించుకోరాదూ' ఫ్రెండ్స్ అన్నారు ఆ మధ్యెప్పుడో. నిట్టూర్పే సమాధానం.

ఏవో ఆలోచనలు...తేరుకుని, పడుకుందామనుకుని మంచం దగ్గరకి వచ్చేసరికి సుజీ పడుకుండిపోయింది... దానిని కాస్త పక్కకు లాగి తనూ నిద్రలోకి జారుకుంది.

* * *

కొన్నాళ్ళయింది.

ఇప్పుడు సుగుణ జీతం మూడువేలు ... ఓ చిన్న ప్రమోషన్. దాంతో పెరిగిన అలవెన్సులు... వగైరాలు.

హ్యాండ్ బ్యాగ్ కోరిక తీరింది.

అమ్మకో చీర, తండ్రికి బట్టలు....పట్టుకొచ్చింది ఆ నెల జీతం అందగానే.

"చూశావా అమ్మా ... నా జీతం పెరిగింది."

"మేం చాలా అదృష్టవంతులమమ్మా ... నీలాంటి పిల్లను కన్నందుకు. మా బాగోగులన్నీ నువ్వే చూసుకుంటున్నావు. కొడుకులున్నా చూసుకుంటారో లేదో గానీ..." చెబుతుంటే తల్లి కళ్ళల్లోంచి నీటి బొట్లు జారిపడ్డాయి. తండ్రి బయట నుంచి రాగానే తల్లి సుగుణ తెచ్చిన బట్టలనిచ్చి పెరిగిన జీతం విషయం ఎంతో పొంగిపోతూ చెప్పింది.

ఎన్నాళ్లనుంచీ ఉద్యోగం చేస్తున్నా తండ్రితో సూటిగా మాట్లాడలేని మనస్తత్వం సుగుణది.

అందరి ముఖాల్లోనూ ఆనందం తాండవిస్తోంది.

అడగాలా....వద్దా.

సుగుణ మళ్ళీ సందిగ్ధంలో పడింది.

ఎప్పటిలా రెండొందలు కాకుండా మరో రెండొందలిచ్చినట్లయితే తను ఒక వందైనా ప్రక్కన దాచగలుగుతుంది.

ఆ తరువాత ఓ గొలుసు... తన స్నేహితురాలు రాజశ్రీ కొనుక్కున్నలాంటిది.

రెండు వారాలయితే గడిచాయిగానీ ఆలోచనల్లోంచి బయటకు రాలేదు సుగుణ...

ధైర్యం చేయాలి అనుకుంటూండగా ఒక రోజు-తల్లితో తండ్రి మాటలు వినిపించాయి.

"చూడు జానకి... నేను ఈనెల నుంచి ఆర్.డి. రెండొందలు కాకుండా అయిదొందలు నా పేరున కట్టడం ప్రారంభించాను. ఇప్పుడు సుగుణ యిదివరకటి కంటే ఎక్కువే యిస్తోంది.... ఇలా చేస్తే బావుంటుందనిపించింది. నా ఆలోచన బాగులేదూ..."

ఎప్పటిలాంటి సమాధానమే జానకి నుంచి

"మంచి పని చేశారు."

తండ్రి తీసుకున్న నిర్ణయం అర్థమైంది సుగుణకి. తన పేర ఆర్.డి. బావుంది. కనీసం- నువ్వేం కొనుక్కోలేదేమమ్మా అని ఒక్కళ్ళైనా అన్నారా ఇంట్లో....

స్వార్థం అర్థమైంది.

గుండెలోంచి పొంగుకొచ్చిన కంటతడి తుడుచుకుంది.

* * *

శేఖర్ ఓ పెద్ద ఫార్మాసూటికల్ కంపెనీలో పర్సనల్ మేనేజర్. సుగుణను చాలాసార్లు చూశాడు.

ఇష్టపడ్డాడు....ఇష్టాన్ని వ్యక్తం చేశాడు.

ఇద్దరూ ఇష్టపడ్డారు....

తాము ఏ ప్రయత్నం చేయకుండానే పైసా కట్నంతో పనిలేని మంచి సంబంధం కుదిరినందుకు సుగుణ తల్లితండ్రులు ఆనందించారు.

పెళ్ళి జరిగిపోయింది.

* * *

"సుగుణా.... నువ్వు చేస్తున్న ఉద్యోగం నీకు సంతృప్తినిస్తోందా."

"ఏం అలా అడుగుతున్నారు"

"అబ్బే ఏం లేదు"

"సందేహం దేనికి .... ఈ మధ్యనే ప్రమోషన్ కూడా వచ్చింది."

"కావచ్చు... అయితే నేను చెప్పబోయే ఉద్యోగం యింకా మంచిది. నీకొచ్చే జీతానికి మూడు రెట్లుంటుంది. ఆ స్టేటస్ వేరు... ఏమంటావు." సుగుణ ఏదో చెప్పబోయింది. "అది కాదు సుగుణా... ఆ కంపెనీ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించింది. మంచి భవిష్యత్తుంది. పైగా నువ్వు కాదనవని..."

" ఆ అని"

"మాటిచ్చాను."

సందిగ్ధంలో పడిపోయింది సుగుణ.

"నువ్వు అంతలా ఆలోచించాల్సిన అవసరం లేదు. నువ్వొక ఆఫీసర్‌వి అక్కడ. అంతేగానీ సెక్రటరీవి కాదు.. ఏమైనా నువ్వు నీ ప్రస్తుత ఉద్యోగానికి రాజీనామా యివ్వడమే మంచిది." ఖచ్చితంగా అనేశాడు.

"అలాగే" అంది.

* * *

కొత్త ఉద్యోగం జీతంతో బాటు బాధ్యతా పెరిగింది.

ఓ రోజున " మనం బ్యాంకులో జాయింట్ అక్కౌంట్ ఓపెన్ చేస్తే బావుంటుం దనిపిస్తోంది సుగుణా. ఆ రకంగా అయితేనే సేవ్ చేయగలుగుతాం. నాకొచ్చే అలవెన్సులు, బోనస్ అందులో వేసేస్తాను. అలాగే నువ్వు నీ జీతాన్ని వేసేయ్. నా జీతంతో, ఇల్లు నడిపేయచ్చు ఎలావుంది ఆలోచన."

సందిగ్ధంలో పడింది సుగుణ. "మనకి ఓ స్వంత ఇల్లు వుండాలా వద్దా... మనం యిలా దాచగలిగితే అదేమంత కష్టంకాదు. ఏమంటావు?"

'స్వంత ఇల్లు' - మనసులో మరోసారనుకుంది సుగుణ. అతని మాటలు సుగుణకు నచ్చాయి.

* * *

సుగుణ - తన కొలీగ్ నీరజతో బాటు షాపింగ్‌కు వెళ్ళింది, బలవంతంచేస్తే. జ్యూయలరీ షాపులో నెక్లెస్ చూసింది... సింపుల్ మోడల్.

ఖరీదు...ఆరువేలు.

మెడకు పెట్టి చూసుకుంది. చాలా బావుందని పించింది. నీరజ చాలా పొగిడేసింది...షాపతను చాలా బావుందన్నాడు. తనకీ కొనాలనిపించింది. నీరజ ఒక చైన్ తీసుకుని బయటపడింది. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ ఇంటి దారి పట్టారు.

* * *

**మ**నసులోని కోరికను శేఖర్ ముందు ఉంచింది. "డ్రా చేయడమా... నోనో... ఒకసారి డిపాజిట్ చేశాక. పైగా మన పర్పస్ తెలుసుగా... ఇంటికోసం"

"ఇంటికోసం" ఆ మాట వినే సరికి సుగుణ ఏం మాట్లాడలేక పోయింది. రాత్రి పడగ్గదిలో సుగుణను దగ్గరికి తీసుకుంటూ-

"చూడు సుగుణా...నువ్వు ఏమీ వేసుకోకపోయినా అందంగా వుంటావు... అందమే నీ ఆభరణ మైనప్పుడు ఇంకా అవన్నీ అవసర మంటావా."

ఏం అనలేకపోయింది సుగుణ.

* * *

**సు**గుణ చపాతి చేసిపెట్టి ముందు గదిలోకి వచ్చింది.

శేఖర్ ఇంకా రాలేదు.

కట్టబోయే ఇంటి తాలూకు ప్లాన్లు ... అవీ వున్న పుస్తకమది. నీరజే యిచ్చింది... వాళ్ళు యిప్పుడు ఆ ఫేజ్ దాటారు... స్వంత ఇల్లుగల వాళ్ళయ్యారు.

ఏ ప్లాను బావుందో ఒకటొకటిగా చూస్తోంది.

ఇంతలో కాలింగ్ బెల్ శబ్దం. సుగుణ గబగబా వెళ్ళి తలుపు తీసింది.

"మైడియర్ సుగుణా... నీకో ఆశ్చర్యకరమైన వార్త రా... ఇలావచ్చి చూడు."

అ హడావిడికి నవ్వుకుంటూ-

"ఏమిటండీ ఆ హడావిడి" అంటూ బయటికొచ్చి చూసింది.

చాక్లెట్ కలర్ ప్రీమియర్ పద్మిని.

"ఎవరిది"

"మనదే"

"....."

"నమ్మవు కదూ... నాకు తెలుసు. అయినా ఇది మనదవడానికి ఎంత యిందను కున్నావు"

"అంత డబ్బు"

"స్కూటర్ అమ్మేశాను"

"అమ్మేసి"

"దానిపైన మన జాయింట్ అక్కౌంట్ వుందిగా... దాంట్లోంచి తీసి మిగిలింది వేశాను."

పాత స్కూటర్ అమ్మితే ఎంత వస్తుందో ఊహించలేనంత చిన్నపిల్ల కాదు సుగుణ.

షాక్ తిన్నట్లు ఫీలైంది.

ముందే కొంటున్న విషయం తెలిస్తే వద్దనగలిగేది. లేదా కనీసం దాని అవసరం గురించి మాట్లాడేది.




అనుకున్నదేమిటి ... జరిగిందేమిటి..

స్వంత ఇల్లు ఊహ కూలి పోయింది పునాదులతో.

ఆ అందమైన ఉహపల్లే ఒక రూపాయి డ్రా చేయడానికి కూడా తను సాహసించలేదు

పెళ్ళికి ముందు ఎంతో....

పెళ్ళి తరువాత...

పెద్ద ఉద్యోగంలో చేరాక....

తన అవసరాలకు తీసుకుంటున్నది మూడొందలు

సుగుణకు గతం గుర్తొచ్చింది.

చిన్న ఉద్యోగంలో వున్నప్పుడు సందిగ్ధంలోనే బ్రతికింది. స్వంతంగా బ్యాగ్ కూడా కొనుక్కోలేని పరిస్థితి. జీతం పెరిగాక తండ్రి ఆర్.డి. కట్టుకున్నాడేగానీ తన గురించి ఆలోచించాడా! స్టేటస్ వున్నా ఆరువేలు పెట్టి నెక్లెస్ కొనుక్కోలేని పరిస్థితి... కనీసం శేఖర్ తనకి మాట మాత్రమైనా చెప్పాడా! అంత ఖర్చు పెడుతున్నప్పుడైనా.... "చూడు సుగుణా... ఇంత ఖర్చు పెట్టేశాననా... డబ్బు సుఖపడడానికే కదా.. ఇంటి గురించి మళ్ళీ సేవ్ చేద్దాం."

సుగుణ మనసు గాయపడింది.

ఎప్పుడూ సందిగ్ధంలోనే బ్రతికిన... బ్రతుకుతున్న తనను తాను తిట్టుకుంది. సుగుణ ఏమీ గొడవ పడలేదు... రేగిన ఆలోచనలను అలాగే గుండెలో వుంచుకుంది.

"కారు చాలా బావుంది... ఈ వారంలో కొంటానన్నారు.... కొనేశారు" ప్రక్కింటాయన మాటలు వినబడు తున్నాయి.

"మరేమిటనుకున్నారు? అన్నయ్యగారంటే ... మీరూ వున్నారు" ప్రక్కింటాయన భార్య... ఆ మాటలు విని తనలో తాను నవ్వుకుంది సుగుణ.

* * *

**ఆ** రోజున సుగుణకు ఫోన్ చేస్తే రాలేదన్నారు ఆఫీసులో. 'ఎందుకు రాలేదు? ఒంట్లో బావుండలేదా' అనుకుని ఇంటికొచ్చేశాడు శేఖర్.

"ఏమిటి సుగుణా... ఒంట్లో బాగాలేదా."

సుగుణ లేచి కూర్చుంది... "బాగానే వుంది... సుబ్బరంగా వున్నాను."

"మరి ఆఫీసుకు వెళ్ళలేదు... శలవు పెట్టాలనిపించిందా."

"అదికాదు... ఇక నుంచి అన్నీ సెలవులే... ఎందుకో చెప్పనా... నేను ఉద్యోగానికి రాజీనామా చేశాను..." శేఖర్ ఆశ్చర్యపోయాడు.

"నేను ఇప్పటికి తెలుసుకున్నాను"

"ఏమిటి"

"నా ఉద్యోగం వల్ల ఏ విధమైన ప్రయోజనం వుండదని." శేఖర్ ఏం మాట్లాడలేదు... కాదు. ఏం మాట్లాడలేకపోయాడు ఆ క్షణంలో! ❐